సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం । 19 । జూలై । 2025



టన్ను చీనీ రూ.15 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



ఎంటీఎస్‌పై కూటమి కక్ష
అతితక్కువ వేతనంతో పనిచేస్తున్న మినిమమ్ టైం స్కేల్ (ఎంటీఎస్) టీచర్లపై కూటమి సర్కార్ పగబట్టింది. జిల్లా సరిహద్దు పాఠశాలలకు బదిలీ చేసింది. 8లో

గరిష్టం/కనిష్టం
35.6°/21.4°
జిల్లాలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 6 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు జిల్లాకు భారీ వర్ష సూచన



అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లాకు శనివారం భారీ వర్ష సూచన ఉన్నట్లు రేకులకుంట వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.విజయశంకరబాబు, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ జి.నారాయణస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 40 మి.మీ మేర సగటు వర్షపాతం నమోదు కావచ్చన్నారు. తర్వాత నాలుగు రోజులు కూడా వర్ష సూచన ఉందని తెలిపారు. 20న 14 మి.మీ, 21న 10 మి.మీ, 22న 15 మి.మీ, 23న 12 మి.మీ. చొప్పున వర్షం కురిసే సూచన ఉన్నట్లు వెల్లడించారు.

సునీతమ్మా.. నోరు అదుపులో పెట్టుకో

- దద్దమ్మ ఎవరో ప్రజలందరికీ తెలుసు
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్ రెడ్డి



సాక్షి, పుట్టపర్తి: రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత నోరు అదుపులో పెట్టుకోవాలని.. దద్దమ్మలు ఎవరో ప్రజలందరికీ తెలుసునని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గంగుల సుధీర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగానే రామగిరి ఎంపీపీ ఎన్నికను వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు బహిష్కరించారన్నారు. ఈ ఏడాది మార్చిలో ఎంపీపీ ఎన్నికకు వస్తుండగా.. టీడీపీ కార్యకర్తలు విధ్వంసాలకు పాల్పడుతున్నా.. పోలీసులు చేష్టలుడిగి చూశారన్నారు. గతంలో (2017) కనగానపల్లిలో వైఎస్సార్ సీపీకి మెజార్టీ ఉన్నప్పటికీ.. పరిటాల సునీత మంత్రి హోదాలో సమావేశానికి హాజరై వైఎస్సార్ సీపీ సభ్యులతో బలవంతంగా చేతులు ఎత్తించి సరిపూటి గీతను ఎంపీపీ చేసిన సంగతిని గుర్తు చేశారు. బలం లేకున్నా.. అధికార దాహంతో దౌర్జన్యాలకు పాల్పడుతూ.. బెదిరింపులకు దిగుతూ ఎన్నికల కోసం తహతహలాడుతున్నదెవరో ప్రజలందరికీ తెలుసన్నారు. కూటమి సర్కారు తీరు.. పోలీసుల వైఖరికి నిరసనగానే ఎన్నికలు బహిష్కరించినట్లు వివరించారు. జిల్లా స్థాయి అధికారుల సమక్షంలో ఎన్నికలు నిర్వహిస్తే.. హాజరై ఎంపీపీ సీటు కై వసం చేసుకుంటామన్నారు.

ఎలుగుబంటి దాడిలో రైతుకు గాయాలు



ఎలుగుబంటి దాడిలో గాయపడిన భూతరాజు

గుడిబండ: పొలం నుంచి ఇంటికి వస్తున్న ఓ రైతుపై ఎలుగుబంటి దాడి చేయగా... రైతు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన శుక్రవారం గుడిబండ మండల పరిధిలోని ఎస్.రాయాపురం గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన భూతరాజు తన పొలంలో వేరుశనగ సాగు చేశాడు. అడవి జంతువుల బారి నుంచి పంటను కాపాడుకునేందుకు గురువారం రాత్రి పొలానికి కాపలా వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటికి వస్తుండగా..మార్గమధ్యంలో హఠాత్తుగా ఎలుగుబంటి దాడి చేసింది. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన భూతరాజును కుటుంబ సభ్యులు గుడిబండ పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

430 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకున్న దృశ్యం

మడకశిర: విజిలెన్స్ అధికారులు శుక్రవారం మడకశిరలోని పలు దుకాణాల్లో దాడులు చేశారు. ఈ సమయంలోనే అటుగా వెళ్తున్న లారీని తనిఖీ చేయగా... 430 బస్తాల రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. దీంతో లారీతో పాటు రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ సీఐ జమాల్‌బాషా తెలిపారు.

తింటేే.. కడుపు మంటే

- పుట్టపర్తి నుంచి నల్లమాడ వెళ్లే దారిలో కొత్తగా ఏర్పాటు చేసిన ఓ రెస్టారెంటులో నలుగురు స్నేహితులు వెళ్లి పార్టీ చేసుకున్నారు. తినేందుకు ఆర్డర్ ఇవ్వగా.. చికెన్ ముక్కలపై విపరీతమైన ఎరుపు రంగు ఉంది. రుచి తేడాగా ఉండటంతో నిర్వాహకులను ప్రశ్నిస్తే.. కొత్తగా ఏర్పాటు చేశామని.. నిబంధనల గురించి తెలియదని చెప్పారు. రుచి కోసం మాస్టర్ ఏం చేస్తున్నాడో సరిగా తెలియదని సమాధానం ఇవ్వడంతో కస్టమర్లు అవాక్కయ్యారు.
- ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం నుంచి కొద్దిగా ముందుకెళ్లిన తర్వాత బ్రిడ్జి పక్కన ఓ ఇంట్లో మెస్ ఏర్పాటు చేశారు. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లోనే వండుతూ వడ్డిస్తున్నారు. గత్యంతరం లేని ప్రజలు బస్టాండుకు సమీపంలో ఉంటుందని అక్కడే తిని వెళ్తుంటారు. అపరిశుభ్రత గురించి నిర్వాహకులను అడిగితే... 'తింటే తినండి.. లేదంటే లేదు' అని చెబుతున్నారు.

- జిల్లాలో విచ్చలవిడిగా ఆహారం కల్తీ
- బయట దొరకని నాణ్యమైన ఆహారం
- అపరిశుభ్ర వాతావరణంలో వంటల తయారీ
- రంగు, రుచి కోసం ప్రమాదకర రసాయనాల వాడకం
- హోటల్ ఆహారంతో చుట్టుముడుతున్న కొత్త రోగాలు
- ఫుడ్ సేఫ్టీ అధికారుల నామమాత్రపు తనిఖీలు
- లాభాపేక్షలో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యాపారులు

సాక్షి, పుట్టపర్తి



జీవన శైలిలో వచ్చిన మార్పులతో ఆహారపు అలవాట్లు కూడా చాలా వరకు మారిపోయాయి. ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితంలో చాలా మంది ఇంటి భోజనం కంటే హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్లు, బేకరీ ఫుడ్‌కు ఓకే చెబుతున్నారు. ఇక వారంతాల్లో చాలామంది కుటుంబాలతో సహా బయటకు వెళ్లి బిర్యానీలు, స్పైసీ ఫుడ్ తినేందుకు ఇష్టపడుతున్నారు. కానీ హోటళ్ల నిర్వాహకులు మాత్రం డబ్బులు తీసుని ఆహారం పేరుతో అనారోగ్యాన్ని వడ్డిస్తున్నారు. నిల్వ ఉన్న పదార్థాలు, పలు రసాయనాలతో చేసిన వంటకాలు వడ్డిస్తూ జనం ప్రాణాలతో ఆడుకుంటున్నారు.

పెరిగిన పార్టీ కల్చర్..

పాతికేళ్ల క్రితం వరకు ఎక్కడికైనా వెళ్లినా భోజనం సమయానికి ఇంటికి వచ్చేవారు. రాలేని పరిస్థితులు ఉన్నప్పుడే మాత్రమే హోటళ్లలో తినేవారు. కొందరు ఎంత సమయమైనా ఇంటికి వచ్చే భోజనం చేసేవారు. బయటి ఆహారాన్ని తీసుకునేవారు కాదు. సంపాదనలో తక్కువ ఖర్చు చేసి, ఎక్కువ దాచుకునేవారు. కానీ ఇప్పుడు 'కల్చర్' మారింది. 'సోషియల్ బిహేవియర్'లో తేడా వచ్చింది. నగరాలు, పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లోకి 'పార్టీ కల్చర్' చొచ్చుకువచ్చేసింది. బర్త్‌డే, మ్యారేజ్‌డే, ప్రమోషన్, ట్రాన్స్‌ఫర్.. సందర్భం ఏదైనా 'పార్టీలు' ఇస్తున్నారు. ఇంటి భోజనం కంటే రెస్టారెంట్లలోని ఆహారం తినడానికే మొగ్గు చూపుతున్నారు. నలుగురు స్నేహితులు కలిస్తే డిన్నర్ బయట చేస్తున్నారు. ఖరీదైన ఆహారం తింటున్నామనే భ్రమలో ఉన్నారు కానీ, ఆరోగ్యకర, పోషకాహారాన్ని తింటున్నామా? లేదా? అనేది గ్రహించలేకపోతున్నారు. పైగా ఏ కల్తీ ఆహారమో కూడా కనిపెట్టలేక...హోటల్ యజమాని పెట్టింది తింటున్నారు.



కొత్తచెరువు మార్కెట్‌లో పండ్ల పరిశీలన (ఫైల్)

నిబంధనలు తూచ్..

జిల్లాలో చిన్నా, పెద్ద హోటల్స్, రెస్టారెంట్స్, దాభాలు, చాట్, నూడుల్స్ షాపులు అన్నీ కలుపుకుని 4 వేలకుపైగా ఉంటాయి. వీటి ద్వారా ఏటా రూ. కోట్ల వ్యాపారం జరుగుతోంది. వాస్తవానికి హోటళ్లు ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి లైసెన్స్ తీసుకోవాల్సి ఉంది. ఆ శాఖ నిబంధనల మేరకు ఆహారం తయారు చేయాలి. ఈ చట్టం 2006 నుంచి అమల్లో ఉంది. ఆ శాఖ పరిధిలో జిల్లా స్థాయి అధికారితో పాటు ఓ గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మరో ఇద్దరు ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. వీరు వివిధ హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి నెలకు కనీసం 12 శాంపిల్స్ సేకరించాలన్నది నిబంధన. వీరు సేకరించిన శ్యాంపిల్స్‌ను ప్రయోగశాలకు పంపి, పరిశీలన తర్వాత కేసులు నమోదు కూడా వీరి బాధ్యతే. ఆహారం కల్తీ జరిగినట్లు తేలితే క్రిమినల్ లేదా సివిల్ కేసులు నమోదు చేసి జరిమానాలు విధించే వీలుంది. కానీ జిల్లాలో ఇవేమీ జరగడం లేదు. దీన్ని ఆసరగా చేసుకున్న వ్యాపారులు చెలరేగిపోతున్నారు. విచ్చలవిడిగా ఆహారాన్ని కల్తీ చేస్తున్నారు.



ధర్మవరంలోని ఓ హోటల్‌లో అధికారుల తనిఖీలు (ఫైల్)

అనుమతి లేని వ్యాపారాలు..

హోటల్ ఏర్పాటు చేయాలంటే తప్పనిసరిగా ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి అనుమతి తీసుకోవాలి. పరిశుభ్రత విషయంలో గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు దరఖాస్తు చేయాలి. నిర్ణీత రుసుము చెల్లించి అనుమతి పొందాలి. కానీ జిల్లాలో ఇలా అనుమతి తీసుకుని వ్యాపారం చేసే సంస్థలు నూటికి 25 శాతానికి మించి ఉండవనేది బహిరంగ రహస్యం. పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు మినహా అధిక శాతం హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్డుపైడు హోటళ్లలో పరిశుభ్రత గురించి పట్టించుకోవడం లేదు. నాసిరకం ఆహార పదార్థాలు వాడటం, రోజుల తరబడి ఫ్రిడ్జిలో నిల్వ ఉంచిన వాటిని వేడి చేసి విక్రయిస్తున్నారు. ఆహారం వండే ప్రాంతాలూ తీవ్ర అపరిశుభ్రంగా ఉన్నా.... పట్టించుకునే నాథుడు లేడు. పట్టణాల్లో అధిక శాతం మురుగుకాల్వలు, చెత్తకుప్పల పక్కన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు దర్శనమిస్తున్నా పర్యవేక్షణ కరువైంది.

నామమాత్రంగా తనిఖీలు..

జిల్లాలో ఏడాదికి 360 శ్యాంపిల్స్ తీసి ల్యాబ్‌కు పంపించాల్సి ఉంది. అయితే అధికారులు జిల్లాలో నెలకు 12 శాంపిల్స్ మాత్రమే తీసి ల్యాబ్‌కు పంపిస్తున్నారు. ఇందులో ఒక్కో నెల కేవలం రెండు, మూడు మాత్రమే కేసులు నమోదవుతున్నాయి. సీజన్‌ను బట్టి పండ్ల దుకాణాలపైనా నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. కల్తీ జరిగిన, రంగులు కలిపిన ఆహార పదార్థాలకు నాన్ స్టాండర్డ్ పేరిట ల్యాబ్ నుంచి రిపోర్ట్ వస్తే వారికి నామమాత్రపు జరిమానా వేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా ఫుడ్‌సేఫ్టీ అధికారులు మేల్కొని హోటళ్లు, రెస్టారెంట్లలో తనిఖీలు నిర్వహించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ఆహార కల్తీ ఇలా..

- చిక్కదనం కోసం పాలల్లో నాసిరకం పాలపొడర్లు, యూరియా, పిండి, నూనె కలిపి విక్రయిస్తున్నారు. అలాగే పరిమాణం పెంచేందుకు బోరు నీటిని కలుపుతారు.
- పశువుల ఎముకలను బట్టీల్లో అత్యధిక ఉష్ణోగ్రతపై మరిగించి ద్రావణాన్ని తీసి వంటనూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీని వల్ల జీర్ణకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.
- ఆకర్షణీయంగా ఉండేందుకు చికెన్, మటన్ బిర్యానీలు, తందూరి చికెన్‌లో ఎక్కువగా హానికరమైన రంగులను కలుపుతున్నారు. ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెలు, పొట్టేళ్లు, మేకలతో పాటు అనారోగ్యానికి గురైన వాటిని వధించి బిర్యానీలో కలిపి విక్రయిస్తున్నారు.
- కారం ఎర్రగా ఉండేందుకు మిరపకాయల్లో సూడాన్ రంగులు కలుపుతున్నారు. పసుపులో మెటానిల్ ఎల్లో అనే పదార్థాన్ని కలుపుతున్నారు. వీటిని వంటలో వినియోగిస్తే కేన్సర్ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది.
- ఒకసారి ఉపయోగించిన నూనెను మళ్లీ కాచి ఆహార పదార్థాలు వండుతున్నారు. దీనివల్ల కేన్సర్, అల్సర్లు వచ్చే ప్రమాదమున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

తనిఖీలు చేస్తున్నాం

జిల్లా వ్యాప్తంగా ఆహార తనిఖీలు చేస్తూనే ఉన్నాం. నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపిస్తున్నాం. ఆహారం కల్తీ అవుతోందని ఎవరైనా ఫిర్యాదు చేసినా... అక్కడకు వెళ్లి నమూనాలు సేకరిస్తున్నాం. ఆహారం కల్తీ జరగకుండా అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నాం. వ్యాపారులను పిలిచి హెచ్చరిస్తున్నాం. – రామచంద్ర, ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి

పంచాయతీ బోరు.. పంటకు నీరు!

- పి.కొత్తపల్లిలో కొన్నినెలలుగా 'తమ్ముడి' దందా
- తాగునీరులేక ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాష్ట్రంలో కూటమి సర్కార్ కొలువుదీరాక టీడీపీ నాయకుల అరాచకాలకు అంతేలేకుండా పోయింది. ముఖ్యంగా రాప్తాడు నియోజకవర్గంలో 'తెలుగు తమ్ముళ్లు' ప్రకృతి వనరులన్నీ దోచేస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. తాజాగా రామగిరి మండలం పేరూరు పంచాయతీ పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త గ్రామంలో తాగునీటి అవసరాల కోసం వేసిన బోరునీటిని తన పొలానికి మళ్లించుకుంటూ దర్జాగా జొన్న, వరి, వేరుశనగ తదితర పంటలను సాగు చేసుకుంటున్నాడు. దీంతో బోరులో నీటిమట్టం తగ్గిపోగా తాగునీటి అవసరాలకు పి.కొత్తపల్లి వాసులంతా సమీపంలో ఉన్న పేరూరు గ్రామానికి వెళ్తున్నారు. ప్రజలు కి.మీ దూరం వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నా... 'తెలుగు తమ్ముడు' మాత్రం తనకేం పట్టనట్లు పంటకు నీరు పారించుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని పంచాయతీ బోరు నీటిని గ్రామస్తులు తాగునీటి అవసరాలకే ఉపయోగపడేలా చూడాలని పి.కొత్తపల్లివాసులు కోరుతున్నారు.



పంచాయతీ బోరు నుంచి పంటకు నీరుపెట్టిన దృశ్యం

హెచ్ఎన్ఎస్ఎస్ పనులు వేగవంతం చేయండి

ప్రశాంతి నిలయం: హంద్రీనీవా సుజల స్రవంతి (హెచ్ఎన్ఎస్ఎస్) పథకం పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్సు హాలులో హెచ్ఎన్ఎస్ఎస్ పనులపై సమీక్షించారు. జిల్లా పరిధిలోని పనులను మూడు కాంట్రాక్టు సంస్థలకు అప్పగించామని, అధికారులు పనులు నిత్యం పర్యవేక్షిస్తూ వేగవంతం చేయాలన్నారు. టన్నెల్ మట్టి పనులు నెలాఖరులోగా పూర్తి చేస్తామని అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. లైనింగ్, టన్నెల్‌తో పాటు బెడ్ వర్క్ పనులన్నీ ఆగస్టు 20వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈ రాజా స్వరూప్‌కుమార్, ఈఈలు మురళి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు శెట్టి, హెచ్ఎన్ఎస్ఎస్ భూసేకరణ విభాగం అధికారి ఇంతియాజ్, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని, ఇందులో నిర్లక్ష్యంగా ఉండే వారిపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పీ–4, పీజీఆర్ఎస్, వసతి గృహాల తనిఖీ తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పీ–4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాల పునఃపరిశీలనకు నిర్వహించే గ్రామ సభల గురించి ఆయా గ్రామాల్లో ముందుగానే ప్రచారం చేసి ప్రజలంతా పాల్గొనేలా చూడాలన్నారు. 'స్వర్ణాంధ్ర విజన్'లో భాగంగా అధికారులంతా ఆయా మండలాల పరిధిలోని వసతి గృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాల్లో నీరు, భోజన వసతిపై నివేదిక పంపాలన్నారు.



హెచ్ఎన్ఎస్ఎస్ పనులపై సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

స్వచ్ఛ ఓటరు జాబితాకు సహకరించండి

తప్పుల్లేని స్వచ్ఛ ఓటరు జాబితాకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ కోరారు. శుక్రవారం ఆయన డీఆర్‌ఓ విజయసారథితో కలసి కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో ఉన్న మృతులు, శాశ్వతంగా వలసవెళ్లిన వారు, డబుల్ ఎంట్రీల తొలగింపునకు సహకరించాలని కోరారు. అలాగే మార్పులు, చేర్పుల కోసం 1,576 మంది బూత్ స్థాయి అధికారులను నియమించామన్నారు. వీరిని సమన్వయం చేసుకుని మార్పులు, చేర్పులుంటే చేసుకోవాలని సూచించారు. 1 జనవరి 2026 నాటికి 18 ఏళ్లు నిండిన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. సమావేశంలో రవినాయక్ (వైఎస్సార్ సీపీ), సతీష్‌కుమార్ (బీజేపీ), సామకోటి ఆదినారాయణ (టీడీపీ) తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు కరువు.. నడిచేందుకు రోడ్డు లేదు

- ఏడాదిలో మనం చేసిన అభివృద్ధి ఇదేనా..?
- జనం ప్రశ్నిస్తుంటే ఏం సమాధానం చెప్పాలో తెలియడం లేదు
- పుట్టపర్తి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ కౌన్సిలర్ల ఆవేదన
- ప్రజల నుంచి పన్ను వసూళ్లకు గట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశం

పుట్టపర్తి టౌన్: ''వార్డుల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించలేకపోతున్నాం. వీధిలైట్లు, తాగునీరు, రోడ్లు అన్నీ సమస్యే. ప్రజలు నిలదీస్తే ఏం చెప్పాలో కూడా తెలియడం లేదు. ఈ సమస్యలపై పలుమార్లు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చినా ఉపయోగం లేదు. సమస్యలు పరిష్కరించనప్పుడు సమావేశాలు ఎందుకు నిర్వహించాలి. టీ తాగి... స్నాక్స్ తిని వెళ్లేందుకా'' అంటూ టీడీపీ కౌన్సిలర్లే ఏడాది కూటమి పాలనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో చైర్మన్ తుంగా ఓబుళపతి ఆధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి, కమిషనర్ క్రాంతికుమార్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ కౌన్సిలర్లు నాగమణి (12వ వార్డు), రమణమ్మ (10వ వార్డు) మాట్లాడుతూ..పుట్టపర్తి అభివృద్ధి గురించి ప్రశ్నల వర్షం కురిపించారు. టీడీపీ అధికారంలోకి ఉన్నా..తాము అధికార పార్టీ కౌన్సిలర్లమే అయినా వార్డుల్లో ప్రజల కనీస అవసరాలు తీర్చలేని దుస్థితిలో ఉన్నామని వాపోయారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, పారిశుధ్యంలోపించడంతో వీధుల్లోకి వెళ్లలేని పరిస్థితి ఉందని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. టీడీపీ కౌన్సిలర్లే ఎదురుదాడి చేయడంతో వేదికపై ఉన్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి, కమిషనర్ దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అనంతరం తేరుకున్న ఎమ్మెల్యే... సమష్టి కృషితో పుట్టపర్తిని అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. సత్యసాయి బాబా శత జయంత్యుత్సవాలకు దేశవిదేశాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున అభివృద్ధి కార్యక్రమాలతో పుట్టపర్తికి నూతన శోభ తీసుకురావాలన్నారు. వీధిలైట్లు, తాగునీరు, రహదారులు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సభ్యులకు సమాధానమిస్తున్న కమిషనర్

పన్నులు వసూలు చేస్తేనే అభివృద్ధి..

ప్రజల నుంచి పన్నులు వసూలు చేయకపోతే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుందని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అధికారులను ప్రశ్నించారు. అవసరమైతే పాలకసభ్యుల సహకారం తీసుకుని ప్రజల నుంచి పన్నులు వసూలు చేయాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ క్రాంతికుమార్ మాట్లాడుతూ... ఆస్తి, నీటి... ఇతర పన్నులు దాదాపు రూ.12 కోట్ల మేర బకాయిలు ఉన్నాయన్నారు. పన్ను వసూలుపై ప్రత్యేక దృష్టి సారించామని, కౌన్సిలర్లు కూడా చొరవ తీసుకుంటే వసూళ్లు పెరుగుతాయన్నారు. పట్టణాభివృద్ధికి దాతలు కూడా ముందుకు రావాలని కోరారు. అనంతరం అజెండాలోని అంశాలపై చర్చ జరపకుండానే వాటికి ఆమోదం తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్లు శ్రీలక్ష్మి, తిప్పన్నతోపాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొటోకాల్ కూడా పాటించరా?

5వ వార్డు కౌన్సిలర్ సూర్యాగౌడ్ మాట్లాడుతూ... అభివృద్ధి పనులు చేపట్టే సమయంలో కనీసం ఆ వార్డు కౌన్సిలర్‌కు కూడా సమాచారం ఇవ్వడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ పాటించకుండా భూమి పూజ ఎలా చేస్తారని నిలదీశారు. ఇంజినీరింగ్ కార్మికులు సమ్మెలోకి వెళ్తున్నామని నాలుగురోజుల కిందటే నోటీసులిచ్చినా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 4 వార్డు కౌన్సిలర్ చెరువు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ... వార్డుల్లో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు మూలన పడిన కాంప్యాక్టర్లు, ఎలక్ట్రికల్ బ్యాటరీలు మరమ్మతులు చేయించాలన్నారు. రోడ్లు అధ్వానంగా మారాయని, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

క్లుప్తంగా

21న జాబ్‌మేళా

అనంతపురం ఎడ్యుకేషన్: ఎంఎన్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో పార్ట్‌టైం, ఫుల్‌టైం ఉద్యోగాల కోసం ఈ నెల 21న ఉదయం 10.30 గంటలకు అనంతపురం జిల్లా ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఉపాధి కల్పనాధికారి పల్లవి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. మొత్తం 43 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన నిరుద్యోగ యువతీయువకులు అర్హులు. జీతం రూ.10 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంటుంది. ఎంపికైన వారు అనంతపురంలో పనిచేయాల్సి ఉంటుంది. ఆసక్తి ఉన్న వారు బయోడేటా ఫారం, విద్యార్హత ఒరిజినల్, జిరాక్స్ పత్రాలు, ఆధార్, బ్యాంకు అకౌంట్, పాన్‌కార్డు వెంట తీసుకెళ్లాలి.

కలుషిత నీరు తాగి 27 గొర్రెల మృతి



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న రైతులు, అధికారులు

రామగిరి: కలుషిత నీరు తాగి 27 గొర్రెలు మృతి చెందిన ఘటన రామగిరి మండలం పెద్ద కొండాపురంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఓ రైతు తన పొలానికి మందు కొట్టేందుకు యూరియాను నీటి తొట్టెలో కలిపి పిచికారీ చేశాడు. అయితే ఈ విషయం తెలియని గొర్రెల కాపరులు గంగన్న, పెద్దన్న తమ జీవాలను మేపునకు తోలుకెళ్లినప్పుడు దాహంతో ఉన్న గొర్రెలు తొట్టెలోని నీటిని తాగాయి. 27 గొర్రెలు మృతి చెందాయి. సమాచారం అందుకున్న పశువైద్యాధికారి మౌలిలీ బాషా అక్కడకు చేరుకుని పరిశీలించారు. ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న మరికొన్ని గొర్రెలకు తక్షణమే చికిత్స అందజేశారు. ఘటనతో రూ.3 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత కాపరులు వాపోయారు.

పట్టపగలే రెండిళ్లలో చోరీ

పావగడ: స్థానిక శ్రీనివాసనగర్‌లో మున్సిపల్ మాజీ అధ్యక్షురాలు సుమ అనిల్, ఉపాధ్యాయుడు పాండు ఇళ్లలో గురువారం మధ్యాహ్నం చోరీ జరిగింది. సుమ, ఆమె భర్త అనిల్ ఇంటికి తాళం వేసి ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వెళ్లారు. ఆ సమయంలో దుండగులు తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలో దాచిన రూ.4 లక్షల విలువైన బంగారు ఆభరణాలు అపహరించారు. అనంతరం నల్లరాళ్ల గంగమ్మ గుడి వీధిలో నివాసముంటున్న ఉపాధ్యాయుడు పాండు ఇంట్లోకి చొరబడి నగదు, బంగారు ఆభరణాలు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ కెమెరా ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

‘ఎంటీఎస్’పై కూటమి కక్ష

☛ ఎంటీఎస్ టీచర్‌గా ఉద్యోగం వచ్చిన ప్రారంభంలోనే ఆయనకు 50 ఏళ్లు. మడకశిర పట్టణ సమీపంలోని ఓ ప్రాథమిక పాఠశాలలో పనిచేసే వారు. కొన్ని నెలల క్రితం అనుకోని విధంగా ప్రమాదానికి గురై కాలు కోల్పోవాల్సి వచ్చింది. ఆస్పత్రిలో చికిత్స పొంది ఇటీవల ఇంటికొచ్చారు. ఇంకా నడవడానికి కూడా కాలు పూర్తి స్థాయిలో సహకరించడం లేదు. ఇలాంటి పరిస్థితిలో ఉన్న ఆ టీచర్‌ని ప్రభుత్వం కర్ణాటక సరిహద్దులోని మారుమూల ఉన్న ఓ ప్రాథమిక పాఠశాలకు బదిలీ చేసింది.

... ఎంటీఎస్ టీచర్లపై ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరించినట్లుగా తెలుస్తోంది. ఇందుకు నిదర్శనమే ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల బదిలీలు. అనారోగ్యంతో బాధపడుతున్నవారు, దివ్యాంగులనే కనికరం కూడా లేకుండా వారిని సుదూరంగా కర్ణాటక సరిహద్దు గ్రామాలకు బదిలీ చేసింది. ఈ లెక్కన ఒక్క మడకశిర నియోజకవర్గంలోనే 220 మంది ఎంటీఎస్ టీచర్లు విధుల్లో చేరాల్సి వచ్చింది.

- సరిహద్దు మండలాల బడులకు నియమించిన ప్రభుత్వం
- దివ్యాంగులనూ కనికరించని కూటమి ప్రభుత్వం
- ఒక మడకశిర నియోజకవర్గానికే 220 మంది కేటాయింపు
- వైఎస్ జగన్ హయాంలో ఉద్యోగాలొచ్చాయనే కక్షతోనే వేధింపులంటున్న ఎంటీఎస్ టీచర్లు



మడకశిర: ఉమ్మడి అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న 1998 డీఎస్సీ ఎంటీఎస్ (మినిమమ్ టైం స్కేల్) టీచర్లపై కూటమి సర్కార్ కక్షపూరితంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించకుండా ఎంటీఎస్ టీచర్లను బదిలీ చేయడమే ఇందుకు నిదర్శనంగా చెబుతున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కర్ణాటక సరిహద్దులో మారుమూల గ్రామాలకు తమను బదిలీ చేసి, ఇబ్బందులకు గురిచేస్తోందని వాపోతున్నారు.

సీఎం చంద్రబాబు వక్ర దృష్టి..

సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న 1998 డీఎస్సీ అర్హుల ఇబ్బందులను గుర్తించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వారి పట్ల సానుకూలంగా వ్యవహరించింది. ఈ క్రమంలో 2023 ఏప్రిల్‌లో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ తీసుకుని 1998 డీఎస్సీలో అర్హత సాధించిన వారికి మినిమమ్ టైం స్కేల్ కింద ఉద్యోగ అవకాశాలు కల్పించారు. నెలకు గౌరవ వేతనంగా రూ.32,670 నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 1998 డీఎస్సీకి సంబంధించి 4,032 మందికి ఉద్యోగాలు దక్కగా, ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి 594 మంది ఉన్నారు. అలాగే 2008 డీఎస్సీకి సంబంధించిన 1,900 మందికీ ఉద్యోగాలు దక్కాయి. అయితే వైఎస్ జగన్ హయాంలో ఉద్యోగాలు దక్కాయనే ఒకేఒక్క కారణంతోనే ఎంటీఎస్ టీచర్లపై సీఎం చంద్రబాబు వక్ర దృష్టి సారించినట్లుగా విమర్శలు వెల్లువెత్తాయి. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో అందరికీ రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను వర్తింపజేసిన ప్రభుత్వం.. ఎంటీఎస్ టీచర్ల విషయంలో మాత్రం కాలరాసిందనే ఆరోపణలున్నాయి. రెగ్యులర్ టీచర్లతో సమానంగా కాకుండా వారి బదిలీల ప్రక్రియ ముగిసిన తర్వాత ఎంటీఎస్ టీచర్ల బదిలీలను చేపట్టింది. పథకం ప్రకారం సాగించిన ఈ కుట్రలో ఎంటీఎస్ టీచర్లు బలిపశువులయ్యారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 594 మంది ఎంటీఎస్ టీచర్లకు గాను ఒక్క మడకశిర నియోజకవర్గానికే 220 మందిని బదిలీ చేశారు. వీరందరూ కర్ణాటక సరిహద్దున మారుమూల పల్లెల్లో విధుల్లో చేరాల్సి వచ్చింది. మిగిలిన 374 మంది కూడా రాయదుర్గం నియోజకవర్గంలోని కర్ణాటక సరిహద్దున ఉన్న మారుమూల గ్రామాలకు బదిలీ అయ్యారు.

గ్రామీణ విద్యార్థులను ఆదుకున్న వైఎస్ జగన్ నిర్ణయం..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యారంగం నిర్వీర్యమై పోతోంది. అనాలోచిత నిర్ణయాలతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సరిహద్దు మండలాల్లో పెద్ద ఎత్తున టీచర్ పోస్టులు ఖాళీ పడ్డాయి. దీంతో సరిహద్దు మండలాల్లోని విద్యార్థుల చదువులు కుంటుపడే పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి సమయంలో వైఎస్ జగన్ నియమించిన ఎంటీఎస్ టీచర్లు విద్యా ప్రదాతలుగా నిలిచారు. ఒకవేళ వైఎస్ జగన్ ఈ ఎంటీఎస్ టీచర్లను నియమించకపోయి ఉంటే సరిహద్దు మండలాల్లోని పాఠశాలలన్నీ ఈ రోజు మూతపడే పరిస్థితి ఏర్పడేది.

ఇటీవల జరిగిన బదిలీల్లో మడకశిర నియోజకవర్గానికి కేటాయించిన ఎంటీఎస్ టీచర్లు

మండలం	ఎంటీఎస్ టీచర్ల సంఖ్య
అమరాపురం	72
గుడిబండ	54
రొళ్ల	56
అగళి	34
మడకశిర	04
మొత్తం	220

బెదిరింపులకు పాల్పడడం హేయం



నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు

తలుపుల: అనంతపురం జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడుని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి పరుష పదజాలంతో దూషిస్తూ బెదిరింపులకు పాల్పడడం హేయమని పంచాయతీ కార్యదర్శులు ఖండించారు. జేసీ ప్రభాకరరెడ్డి వైఖరిని తప్పు పడుతూ శుక్రవారం తలుపుల ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. నిబద్ధతతో పనిచేసే జిల్లా స్థాయి అధికారిపైనే ఇంతటి దౌర్జన్యం చేస్తున్న జేసీ ప్రభాకరరెడ్డి ఇక తన పరిధిలోని మండల, గ్రామస్థాయి అధికారులను ఎంతటి భయభ్రాంతులకు గురిచేస్తుంటారో ఊహించలేమన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జేసీ ప్రభాకరరెడ్డిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబాలకు చేయూత



చెక్కును అందజేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత నెలలో వేర్వేరు కారణాలతో మృతి చెందిన ముగ్గురు హోంగార్డులకు సంబంధించి వారి కుటుంబాలకు ఎస్పీ పి.జగదీష్ శుక్రవారం ఆర్థిక చేయూతనందించారు. శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన హోంగార్డు బి.తిరుపాల్‌నాయక్ కుటుంబానికి జిల్లా హోంగార్డుల ఒక్క రోజు వేతనాన్ని విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తం రూ.4,33,200తో పాటు ఫ్లాగ్ ఫండ్ కింద రూ.10 వేలు, అనంతపురం జిల్లాలో పని చేస్తూ మరణించిన లక్ష్మీరెడ్డి కుటుంబానికి ఫ్లాగ్ ఫండ్ కింద రూ.10 వేలు, శ్రీసత్యసాయి జిల్లా హోంగార్డుగా పనిచేస్తూ చనిపోయిన నరసింహులు కుటుంబానికి ఫ్లాగ్ ఫండ్ కింద రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని చెక్కుల రూపంలో అందజేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు పవన్‌కుమార్, రాముడు, ఆర్ఎస్ఐ జాఫర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

రాప్తాడు రూరల్: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం రూరల్ మండలం రాచానపల్లికి చెందిన రామప్ప (47), రామాంజనమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రైవేట్ వాహన డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న రామప్ప కొంత కాలం క్రితం సెల్యులైటిస్ వ్యాధి బారిన పడ్డాడు. ఎడమకాలు మోకాలి నుంచి కింద పాదం వరకూ బాగా దెబ్బతినింది. చాలాచోట్ల చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన ఆయన శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లోనే ఫినాయిల్ తాగాడు. అపస్మారక స్థితిలో చేరుకున్న రామప్పను గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఎస్‌టీఎల్‌కు ‘ఎన్‌ఏబీఎల్’ గుర్తింపు

- ఈ ఏడాది 25 వేల మట్టి పరీక్షల లక్ష్యం



భూసార పరీక్షా కేంద్రానికి లభించిన ఎన్‌ఏబీఎల్ అక్రిడిటేషన్‌ను జేడీఏ ఉమామహేశ్వరమ్మకు చూపిస్తున్న ఏడీఏ రోజాపుష్పలత

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక భూసార పరీక్షా ప్రయోగశాల (సాయిల్ టెస్టింగ్ ల్యాబొరేటరీ - ఎస్‌టీఎల్)కు కేంద్ర ప్రభుత్వం ఎన్‌ఏబీఎల్ (నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబరేటరీస్) గుర్తింపు దక్కినట్లు వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. శుక్రవారం స్థానిక భూసార పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన సందర్భంగా ఎన్‌ఏబీఎల్ అక్రిడిటేషన్‌ను ఆమెకు ఎస్‌టీఎల్ ఏడీఏ రోజాపుష్పలత చూపించారు. రాష్ట్ర వ్యాప్తంగా 29 ప్రయోగశాలలు ఉండగా అనంతపురంతో పాటు గుంటూరు, గొల్లపూడి, ఆముదాలవలసలోని ప్రయోగశాలలకు అక్రిడిటేషన్ దక్కిందన్నారు. ఈ గుర్తింపు 2028 వరకు ఉంటుందన్నారు. మట్టి సేకరణ, వాటి ద్వారా స్థూల, సూక్ష్మపోషకాల శాతం తెలుసుకునేందుకు 12 రకాల పరీక్షలు నిర్వహించడం, వాటిని ఆన్‌లైన్ చేయడం, వాటి ఫలితాలను సకాలంలో రైతులకు అందించడం, అలాగే లక్ష్యం మేరకు పరీక్షలు పూర్తి చేయడం, కేంద్రంలో మౌలిక సదుపాయాల కల్పన, మానవ వనరుల లభ్యత తదితర అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని ఎన్‌ఏబీఎల్ అధికారులు అక్రిడిటేషన్ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా 25 వేల మట్టి పరీక్షలు చేయాలని లక్ష్యంతో ఉన్నామని, ఇప్పటికే 17,750 వరకు మట్టి శ్యాంపిల్స్ ప్రయోగశాలకు చేరగా.. పరీక్షలు ముమ్మరం చేసినట్లు పేర్కొన్నారు.

అనంత భూముల్లో పోషకాల లోపం

- సేంద్రియ కర్బనం, నత్రజని, జింక్‌సల్ఫేట్ పోషక శాతం తక్కువే

అనంతపురం అగ్రికల్చర్: గత కొన్నేళ్లుగా అధికంగా రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం కారణంగా జిల్లా భూములు చాలా వరకు నిస్సారంగా మారుతున్నాయని వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక భూసార పరీక్షా ప్రయోగశాల (సాయిల్ టెస్టింగ్ ల్యాబొరేటరీ-ఎస్‌టీఎల్)ను ఆమె సందర్శించారు. అక్కడ చేపట్టిన మట్టి పరీక్షల గురించి ఏడీఏ రోజాపుష్పలతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేడీఏ మాట్లాడారు. గతేడాది చేసిన మట్టి పరీక్షలు, వాటి ఫలితాలను పరిగణనలోకి తీసుకుంటే... ‘అనంత’ భూముల్లో అత్యంత కీలకమైన సేంద్రియ కర్బనం (ఆర్గానిక్ కర్బన్) శాతం క్షీణించిపోయిందన్నారు. దాదాపు అన్ని మట్టి పరీక్షల్లోనూ కర్బనం శాతం చాలా తక్కువగా ఉన్నట్లు వెల్లడైందన్నారు. దీంతో పాటు నత్రజని (నైట్రోజన్), అలాగే జింక్‌సల్ఫేట్ లాంటి సూక్ష్మపోషకాల లోపం (మైక్రో న్యూట్రియంట్ డెఫిసెన్సీ) కూడా ఎక్కువగా ఉందన్నారు. పొటాష్ శాతం మాత్రం సాధారణం కన్నా అధికంగానే ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు సేంద్రియ కర్బన శాతం పెంచుకునే చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకోసం పశువుల ఎరువు, గొర్రెలు, మేకలు, కోళ్ల ఎరువు, వర్మీకంపోస్టు లాంటివి వేసుకోవాలని సూచించారు. వీటితో పాటు జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ లాంటి గ్రీన్‌మెన్యూర్ (పచ్చిరొట్ట ఎరువుల) వాడకం పెరగాలన్నారు. ఈ పంటలు వేసుకుని కలియదున్నితే భూసారం గణనీయంగా పెరుగుతుందన్నారు. అలాగే వేప, కానుగ, జిల్లేడు లాంటి వృక్ష సంబంధిత పోషకాలు, బయో ఫర్టిలైజర్స్ వేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వీటిని ఎక్కువగా వాడితే భూమి గుల్లబారడమే కాకుండా పంటలకు మేలు చేసే సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని తెలిపారు. వీటిపై రైతుల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అక్కడే ఉన్న క్రిమిసంహారక మందుల పరీక్షా ప్రయోగశాల (పెస్టిసైడ్ టెస్టింగ్ ల్యాబ్-పీటీఎల్)ను సందర్శించి అక్కడ జరుగుతున్న పరీక్షల గురించి ఏడీఏ హైమావతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఓలు శ్రీనాథరెడ్డి, శేఖర్‌రెడ్డి, నివేదిత, మెహన్ తాజ్, ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దుర్మరణం

గుంతకల్లు రూరల్: మండలంలోని పాతకొత్తచెరువు వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లులోని తిలక్‌నగర్‌కు చెందిన సుబ్బరాయుడు, తన కుమారుడు అశోక్ (20)తో కలసి కూరగాయల మార్కెట్‌లో ఆకుకూరల వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో పట్టణానికి చెందిన తన స్నేహితుడు సాయితో కలసి శుక్రవారం తన ద్విచక్ర వాహనంలో వెళ్లిన అశోక్.. మధ్యాహ్నం గుంతకల్లుకు తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో పాతకొత్తచెరువు మసీదు వద్ద వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. ఘటనలో తలకు తీవ్రగాయమై అశోక్ అక్కడికక్కడే మృతిచెందాడు. స్వల్పగాయాలతో సాయి బయటపడ్డాడు. ఘటనపై గుంతకల్లు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

లోపాలను సరిదిద్దుకోండి : డీఎంహెచ్‌ఓ



మాతాశిశు మరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగం

పుట్టపర్తి అర్బన్: లోపాలను సరిదిద్దుకొని జిల్లాలో మాతాశిశు మరణాలను పూర్తిగా అరికట్టేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫైరోజాబేగం ఆదేశించారు. జూన్ నెలలో జిల్లాలో చోటు చేసుకున్న మాతాశిశు మరణాలపై సంబంధిత వైద్యాధికారులతో శుక్రవారం తన కార్యాలయంలో ఆమె సమీక్షించారు. సోమందేపల్లి, పుట్టపర్తి, బోయపేట, కొక్కంటి, ఎనుములపల్లి, పెనుకొండలో ఒక్కొక్కటి చొప్పున, రామగిరిలో రెండేసి శిశు మరణాలు సంభవించాయని గుర్తు చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన వైద్య సేవలను చేరువ చేశామని, అయినా మరణాలు సంభవించడం వెనుక ఉన్న లోపాలను గుర్తించాలని సూచించారు. ప్రతి పీహెచ్‌సీలోనూ ప్రతి నెలా గర్భిణులను సమావేశ పరిచి ఆరోగ్య సూత్రాలు తెలియజేయాలన్నారు. ప్రతి కాన్పునూ స్వయంగా పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి, గైనకాలజిస్ట్ డాక్టర్ ప్రత్యూష, పీడియాట్రిషియన్ డాక్టర్ శ్రీనునాయక్, డీపీహెచ్‌ఎన్‌ఓ వీరమ్మ, పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జీతాల మంజూరులో జాప్యం తగదు : ఎస్టీయూ

గాండ్లపెంట: బదిలీలు, పదోన్నతుల్లో భాగంగా కొత్తగా మంజూరైన పోస్టుల్లో చేరిన ఉపాధ్యాయుల జీతాల మంజూరులో జాప్యం చేయరాదని ప్రభుత్వానికి ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాదరెడ్డి సూచించారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదులో భాగంగా ఎన్‌పీ కుంట మండల కేంద్రంలోని పాఠశాల వద్ద ఆయన శుక్రవారం మాట్లాడారు. పునర్వవస్థీకరణలో భాగంగా ప్రభుత్వం ఆదర్శ పాఠశాలలను, ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరణ చేసి మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులను, అదనపు ఉపాధ్యాయులను గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా నియమించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే ఆయా స్థానాలలో కేటాయించిన ఉపాధ్యాయులకు జూన్ నెల వేతనాలు ఇప్పటి వరకూ మంజూరు చేయకపోవడం అన్యాయమన్నారు. సాంకేతిక లోపాలను సరిచేసి జూన్, జూలై నెలల వేతనాలు తక్షణమే మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపచేయాలని, పాఠశాల స్థాయిలో బోధనేతర పనులను రద్దు చేయాలని, పెండింగ్ డీఏ, 30 శాతం మధ్యంతర భృతిని తక్షణమే ప్రకటించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కౌన్సిలర్ వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు రామాంజనేయులు, తిరుమల ప్రసాద్, రమేష్, హెచ్‌ఎం శాంతమ్మ, గంగయ్య, రాజశేఖర్, సాంబశివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రీ పీహెచ్‌డీ పరీక్ష షెడ్యూల్ మార్పు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో ప్రీ పీహెచ్‌డీ పరీక్ష షెడ్యూల్‌ను మార్పు చేశారు. ఈ మేరకు వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జి. వెంకటరమణ శుక్రవారం వెల్లడించారు. ఈ నెల 22, 23, 24 తేదీల్లో నిర్వహించాల్సిన ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు ఆగస్టు 5, 6, 7వ తేదీల్లో నిర్వహించనున్నారు. ఏపీపీఎస్సీ డిగ్రీ లెక్చరర్ల రాత పరీక్ష నేపథ్యంలో ఈ మార్పు చేశారు. ఆగస్టు 5వ తేదీ రీసెర్చ్ మెథడాలజీ (పేపర్-1), 6న అడ్వాన్స్‌డ్ సబ్జెక్టు పేపర్/రీసెంట్ అడ్వాన్సెస్ ఇన్ ద సబ్జెక్టు (పేపర్-2), 7న పేపర్ ఆన్ రీసెర్చ్ ఏరియా (పేపర్-3) పరీక్షలు జరుగుతాయి. ప్రతి పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నారు.

నాణ్యత తుంగపాలు

హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు ఇష్టారాజ్యంగా కొనసాగుతున్నాయి. కాంట్రాక్టర్ల స్వార్థం... అధికారుల కమీషన్ల కక్కుర్తి కారణంగా ఇప్పటి వరకు పనులు పూర్తి నాసిరకంగా జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. రెండ్రోజుల్లోనే పనులు ముగించేస్తే ఆ తర్వాత నీళ్లొచ్చేస్తాయని, ఇక నాణ్యత గురించి అడిగేదెవరనే ధీమా కాంట్రాక్టర్లు, అధికారుల్లో వ్యక్తమవుతోంది.

- హెచ్చెల్సీ ఆధునికీకరణ పనుల్లో ఇష్టారాజ్యం
- అధికారుల పర్యవేక్షణ లోపం.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం
- ఇంకా కొనసాగుతున్న బ్రిడ్జిల నిర్మాణ పనులు

బొమ్మనహాళ్/కణేకల్లు: జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న హెచ్చెల్సీపై ఇటు రైతులు.. అటు ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. సాగునీటితోపాటు జిల్లా ప్రజల దాహార్తిని ఈ ప్రాజెక్ట్ తీర్చుతోంది. అయితే రూ.35.06 కోట్లతో చేపట్టిన ఆధునికీకరణ పనులు నాసిరకంగా సాగుతుండడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. అధికారులు ఈ ఏడాది మార్చి నెలలో టెండర్లు నిర్వహించారు. అగ్రిమెంట్ల ప్రక్రియ ముగిసిన వెంటనే పనులు ప్రారంభించి ఉంటే ఈ పాటికి వంద శాతం పనులు పూర్తయ్యేవి. అయితే ఇందుకు విరుద్ధమైన పరిస్థితులు చోటు చేసుకున్నాయి. పనులు ప్రారంభించే విషయంలో కాంట్రాక్టర్లు అనవసరంగా కాలయాపన చేశారు. చేపట్టిన పనులు కూడా నత్తనడకన కొనసాగిస్తూ వచ్చారు. కనీసం చేసిన పనులైనా నాణ్యతతో ఉన్నాయంటే అది కూడా లేదు. హెచ్చెల్సీ లైనింగ్, యూటీ, కాలువలో కాంక్రీట్ బెడ్డింగ్ పనులు నాసికరంగా జరిగాయి.

48 గంటల్లోనే బయట పడిన పనుల్లో డొల్లతనం

హెచ్చెల్సీ లైనింగ్ పనులు పూర్తి నాసిరకంగా జరిగాయి. మైలాపురం, నాగలాపురం, యర్రగుంట యూటీ వద్ద చేపట్టిన లైనింగ్ పనుల్లో నాణ్యత డొల్లతనం కేవలం 48 గంటల్లోనే బయట పడింది. పూర్తయిన పనుల్లో ఇసుక, కంకర తేలి అధికారుల పర్యవేక్షణ లోపాన్ని ఎత్తి చూపుతున్నాయి. పనుల్లో ఎటు చూసినా హెచ్చుతగ్గులు... ఇసుక ప్యాచ్‌లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మైలాపురం వద్ద గతంలో కాలువకు గండి పడిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఆ ప్రాంతంలో పూర్తయిన పనుల్లో నాణ్యత లోపం స్పష్టంగా అవగతమవుతోంది. నిబంధనల ప్రకారం ఎర్రమట్టితో కాలువ గట్టును పూడ్చి బాగా గట్టు పటిష్టపడేలా రోలింగ్ చేయాల్సి ఉంది. అయితే ఇందుకు విరుద్ధంగా కట్టకు సమాంతరంగా ఎర్రమట్టి పోసి వదిలేశారు. కాలువ గట్టు బలోపేతానికి నాణ్యమైన ఎర్రమట్టిని వాడాల్సి ఉండగా, లూజ్ సాయిల్ వేసి వాడి పడేసిన పాత రాళ్లను పరిచి పనులు ముగించేశారు. నాణ్యత లేని కారణంగా భవిష్యత్తులో పగుళ్లు ఏర్పడే ప్రమాదముందని రైతులు పేర్కొంటున్నారు. లైనింగ్‌కు ఉపయోగించే సిమెంట్ కాంక్రీట్ మిశ్రమంలో ఇసుక, కంకర ఎక్కువ వాడి సిమెంట్ తక్కువ వేశారని అంటున్నారు.

కనిపించని అధికారులు

హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులను దగ్గరుండి పర్యవేక్షించాల్సిన ఇంజినీర్లు పనుల వద్ద కన్పించకుండాపోయారు. హెచ్చెల్సీ ఎస్ఈ, ఈఈలు విధిగా పనులు జరిగేచోట ఏఈఈలను నియమించినా వారు మాత్రం ఉండకుండా పోవడం గమనార్హం. ముఖ్యమైన పనులుంటే ఫోన్‌లోనే ఆదేశాలిచ్చి పనులు సాగేలా చేశారన్న ఆరోపణలున్నాయి. దీంతో ఆధునికీరణ పనుల్లో కాంట్రాక్టర్లు ఆడిందే ఆట... పాడిందే పాటగా సాగింది.



ఉద్దేహాళ్-మల్లికేతి మధ్యలో 115-167 కిలోమీటర్ వద్ద కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు



యర్రగుంట వద్ద నాసిరకంగా చేసిన లైనింగ్ పనులు

నీళ్లొస్తున్నా... కొనసాగుతున్న పనులు

హెచ్చెల్సీకి శుక్రవారం ఉదయం ఆంధ్రా సరిహద్దున 105 కిలోమీటర్ వద్ద నీటిని విడుదల చేశారు. ఓ వైపు కాలువలో నీరు ప్రవహిస్తుండగా మరోవైపు పనుల్లో కాంట్రాక్టర్ల హడావుడి కన్పించింది. లైనింగ్, కాలువగట్ల పటిష్టత పనులు చేస్తూనే ఉన్నారు. ఉద్దేహాళ్-మల్లికేతి బ్రిడ్జి, నాగలాపురం బ్రిడ్జి పనులు పూర్తి కాలేదు. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకం కలగకుండా ఓ వైపు వదిలి, మరో వైపు బ్రిడ్జి పనులు చేస్తున్నారు. ఈ పనులు పూర్తయ్యేందుకు వారం రోజులు సమయం పట్టే అవకాశం ఉందని అంటున్నారు.

ప్రారంభం కాని కణేకల్లు చెరువు అవుట్‌ఫా రెగ్యులేటర్

కణేకల్లు చెరువు అవుట్‌ఫాల్ రెగ్యులేటర్ పనులు ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ప్రస్తుతం హెచ్చెల్సీకి నీరు రావడంతో ఈ పనులు చేయలేని పరిస్థితి నెలకొంది. హెచ్చెల్సీకి నీటి సరఫరా బంద్ అయిన తర్వాత అంటే వచ్చే ఏడాది ఫిబ్రవరిలో పనులు ప్రారంభించాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం.